ఆదర్శప్రాయుడు లక్ష్మణ్ బాపూజీ

రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య


లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, జైసింహ, ఎయిర్‌టెల్ రాజు, పున్న సత్యనారాయణ, ఊర్మిళ

కాచిగూడ: గాంధీజీ పిలుపుతో మొట్టమొదట క్విట్ ఇండియా ఉద్యమంలోనూ, రెండోసారి రజాకార్లు, నిజాం ప్రభువులకు వ్యతిరేకంగా, మూడవసారి తెలంగాణ తొలిదశ, మలిదశ ఉద్యమాల్లో పాల్గొన్న ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ నేటి తరానికి ఆదర్శనీయుడని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. బాపూజీ 12వ వర్ధంతి సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ఆధ్వర్యంలో శనివారం కాచిగూడలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ బాపూజీకి ముఖ్యమంత్రి అయ్యే అవకాశాలు ఉన్నా కాంగ్రెస్ పార్టీ ఆయనకు మోసం చేసిందన్నారు. లక్ష్మణ్ బాపూజీకి భారత రత్న ఇవ్వాలని కోరారు. బీసీ ముఖ్యమంత్రిని చేయాలని కొండా లక్ష్మణ్ బాపూజీ తన తుది శ్వాసవరకు పోరాటం చేశారని అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం నేటి యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నేతలు గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, వేముల రామకృష్ణ, జిల్లపెల్లి అంజి, సతీష్, మురళీకృష్ణ, సురేష్, పండరినాథ్, శ్రీకాంత్, చౌటుపల్లి సురేష్, సూర్యనారాయణ, జానయ్య, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మూడు తరాల యోధుడు బాపూజీ

చిక్కడపల్లి: మూడుతరాల పోరాటయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ కొనియాడారు. పద్మశాలీ ప్రజాసంఘం ముషీరాబాద్ ఆధ్వర్యంలో శనివారం అశోక్‌నగర్ క్రాస్‌రోడ్డులోని బాపూజీ విగ్రహం వద్ద వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. బాపూజీ విగ్రహానికి ఎమ్మెల్యే ముఠా గోపాల్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నేత ఎం ఎన్ శ్రీనివాస్‌రావు, యువ నాయకులు ముఠా జైసింహ, కాంగ్రెస్ నగర ఉపాధ్యక్షులు గుర్రం శంకర్, అభిషేక్ కెనడీ, పురుషోత్తం, మారిశెట్టి నర్సింగ్‌రావు, బాబ్జి, గుండు జగదీశ్‌కుమార్, ప్రద్మశాలీ ప్రజాసంఘం ముషీరాబాద్ నియోజ వర్గం నాయకులు ఎయిర్‌టెల్ రాజు, పున్నా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


బాపూజీకి నివాళులర్పిస్తున్న ఎంఎన్ శ్రీనివాస్, గుర్రం శంకర్, కెనడీ రాజు, అభిషేక్ కెనడీ, పి.సత్యనారాయణ, యాదగిరి


బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఆర్.కృష్ణయ్య, గుజ్జ సత్యం తదితరులు

విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకోవాలి



సుందరయ్య విజ్ఞానకేంద్రం: విద్యార్థులు నిర్దిష్టమైన లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగాలని, అప్పుడే ఉన్నత శిఖరాలు చేరుకోవడం సాధ్యమవుతుందని బ్రహ్మకుమారి వసంతలక్ష్మి అన్నారు. శనివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాలలో అంతర్జాతీయ శాంతి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వసంతలక్ష్మి మాట్లాడుతూ ప్రపంచంలో అహింస, శాంతి ఉన్నప్పుడే ప్రజలు సుఖసంతోషాలతో జీవించగలుగుతారని అన్నారు. అందరూ కులమతాలకు అతీతంగా సోదరభావంతో మెలగాలని సూచించారు. ప్రపంచ శాంతి కోసం విద్యార్థులు సైతం తమ వంతుగా ప్రయత్నించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వాజీర్ హజారే తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాల్లో ఏచూరి చెరగని ముద్ర



ముషీరాబాద్: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి భారత రాజకీయాల్లో చెరగని ముద్ర వేశారని బీఆర్ఎస్ ముషీరాబాద్, భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, వై.శ్రీనివాస్‌రావు కొనియాడారు. శనివారం ముషీరాబాద్‌లో నిర్వహించిన సీతారాం ఏచూరి సంతాపసభలో వారు మాట్లాడుతూ పార్లమెంటులో ప్రజల పక్షాన గళాన్ని వినిపించి సమస్యల పరిష్కారానికి కృషి చేశారని అన్నారు. విద్యార్థి దశ నుంచే పోరాటపటిమను అలవర్చుకొని ప్రజలకు అండగా నిలిచారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శంకర్‌గౌడ్, ప్రవీణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం



ముషీరాబాద్: మతిస్థిమితం లేని ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన ముషీరాబాద్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు... భోలక్‌పూర్‌లో నివాసం ఉంటున్న డి.ప్రభాకర్(58) వృత్తిరీత్యా సెంట్రింగ్ కార్మికుడు. ఆయనకు భార్య రేణుక, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొద్దికాలంగా ఆయనకు మతిస్థిమితం ఉండటంలేదు. ఈ నెల 17వ తేదీన గణేష్ నిమజ్జనం కోసం బయటకు వచ్చిన ప్రభాకర్ తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు ఆయన కోసం పరిసర ప్రాంతాలు, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో అతని కుమారుడు సతీష్ శనివారం ముషీరాబాద్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్సై ప్రేమ్‌కుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఖాళీ స్థలాలను క్రమబద్ధీకరించాలి

మంత్రి పొంగులేటికి కాంగ్రెస్ నేతల వినతి


మంత్రి పొంగులేటికి వినతిపత్రం అందజేస్తున్న గుర్రం శంకర్, కెనడీ రాజు, మల్లేష్

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లోని ఎస్సార్టీ, టీఆర్టీ క్వార్టర్స్ ఖాళీ స్థలాలను జీవో నంబర్ –59 ప్రకారం క్రమబద్ధీకరించాలని కాంగ్రెస్ నాయకులు, స్థానికులు కోరారు. ఈ మేరకు శనివారం సచివాలయంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నగర కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గుర్రం శంకర్, కెనడీ రాజు, స్థానిక క్వార్టర్స్ వాసి నర్మెట్ట మల్లేష్ మాట్లాడుతూ ఎస్సార్టీ, టీఆర్టీ క్వార్టర్స్ వెనకాల ఉన్న ఖాళీ స్థలాలను రెగ్యూలరైజేషన్ చేయాలని మంత్రిని కోరడంతో ఆయన సానుకులంగా స్పందించారని అన్నారు.

తాటికొండల భ్రమరాంబ సాహిత్య పురస్కారం ప్రదానం



సుందరయ్య విజ్ఞానకేంద్రం: ప్రముఖ కథారచయిత, నంది అవార్డు గ్రహీత తాటికొండల నర్సింహారావు సతీమణి పేరిట నెలకొల్పిన తాటికొండల భ్రమరాంబ సాహిత్య పురస్కార ప్రదాన కార్యక్రమం శనివారం జరిగింది. సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో తెలుగు విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఎస్. గోపికి 2023, ప్రముఖ సాహితీవేత్త ప్రసేన్‌కు 2024 సంవత్సరాలకుగాను ఈ అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి, విమర్శకులు నందిని సిధారెడ్డి, సాహితీవేత్తలు ఏనుగు నర్సింహారెడ్డి, తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షుడు జూలూరి గౌరీశంకర్, ప్రముఖ కవులు సీతారాం, యాకూబ్, ఆనందాచారి, గుడిపాటి వెంకట్, ఎస్.రఘు, తాటికొండల నర్సింహారావు, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'బాపూజీ' పోరాటం స్ఫూర్తిదాయకం


లక్ష్మణ్ బాపూజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న భాస్కర్, జగన్నాథం

కాచిగూడ: స్వాతంత్ర్యోద్యమంలోనే కాకుండా తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీని యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని అఖిల భారత పద్మశాలీ సంఘం సెక్రటరీ జనరల్ గడ్డం జగన్నాథం, యువజన విభాగం జాతీయ ఇన్‌చార్జి అవ్వారి భాస్కర్ అన్నారు. శనివారం లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా నారాయణగూడలోని పద్మశాలీ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పదవులను త్యాగం చేసి, నిస్వార్థ ప్రజానాయకుడిగా ఖ్యాతికెక్కిన బాపూజీ జయంతి రోజును ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించాలన్నారు. చేతివృత్తుల వారికి కుటీర పరిశ్రమల ఏర్పాటుతోపాటు దళిత వర్గాల అభ్యున్నతికి ఉద్యమాలు నిర్వహించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కత్తుల సుదర్శన్, చిక్క దేవదాస్, జయరాజ్, జెల్ల నరేందర్, కొకుల దేవేందర్, కల్లెపల్లి రాజు, అంబటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం..

నల్లకుంట: విజిలెన్స్ కమిషనర్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎంజీ గోపాల్‌ను శనివారం స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కె.రాజేష్, ఆలూరి చక్రవర్తి, మూర్తి, డి. సుధాకర్ శర్మ, పి.సీతారామయ్య, వి.శ్రీనివాస్, సీహెచ్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


గోపాల్‌ను సన్మానిస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు

సత్యనారాయణ యాదవ్ మృతి తీరని లోటు


సత్యనారాయణ యాదవ్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

కాచిగూడ: యాదవ కులపెద్ద సత్యనారాయణ యాదవ్ మృతి యాదవ సమాజానికి తీరని లోటని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సత్యనారాయణ పార్థివ దేహాన్ని శనివారం కాచిగూడలో ఆయన నివాసంలో సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. యాదవ సంఘం అభివృద్ధికి ఎంతో కృషి చేసిన సత్యనారాయణ యాదవ్ మృతి చాలా బాధాకరమని అన్నారు.

బాబూరావు యాదవ్‌కు పరామర్శ

ఇటీవల అనారోగ్యానికి గురైన అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బద్దుల బాబూరావు యాదవ్‌ను శనివారం కాచిగూడలోని ఆయన నివాసానికి వెళ్లి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

వడ్డె ఓబన్న విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలి

జాతీయ వడ్డెర సంఘం అధ్యక్షుడు వేముల వెంకటేష్


రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి వినతి పత్రం అందజేస్తున్న వేముల వెంకటేష్

కాచిగూడ: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షుడు వేముల వెంకటేష్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వేముల వెంకటేష్ ఆధ్వర్యంలో సంఘం ప్రతినిధి బృందం శనివారం రాష్ట్ర పర్యాటక,సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావును ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఓబన్న జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం హర్షణీయమని అన్నారు. అన్ని రంగాల్లో వెనుకబడిన వడ్డెర్ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి ఆదుకోవాలని కోరారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డెర్లకు మైనింగ్‌పై 20 శాతం ఇచ్చిన రిజర్వేషన్లను అమలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో బత్తుల లక్ష్మీకాంతయ్య, ఆలకుంట్ల తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద కాలేజీలో 'ఓరియంటేషన్'



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఉన్నత విద్యా మండలి చైర్మన్ లింబాద్రి

ముషీరాబాద్: వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024–25విద్యా సంవత్సరంలో చేరిన నూతన విద్యార్థినీవిద్యార్థులకు శనివారం ఓరియంటేషన్, ఫ్రెషర్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి హాజరై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.ప్రభ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా ఉన్నత విద్యాశాఖ అధికారులు ప్రొఫెసర్ యాదగిరి,ప్రొఫెసర్ రాజేందర్‌సింగ్,జాయింట్ డైరెక్టర్లు, అకడమిక్ గైడెన్స్ ప్రొఫెసర్ బాలభాస్కర్, ఖైరతాబాద్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజేందర్, సీతాఫల్‌మండి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామచంద్రం హాజరయ్యారు. వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

నేతకాని వర్గానికి న్యాయం చేయాలి

కవాడిగూడ: నేతకాని సామాజిక వర్గానికి కార్పొరేషన్‌తోపాటు నామినేటెడ్ పదవుల్లో సముచిత న్యాయం కల్పిస్తామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని నేతకాని మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేష్ అన్నారు. శనివారం నేతకాని సామాజిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలపై మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ అన్ని రంగాలలో వెనుకబడిన నేతకాని సామాజిక వర్గాన్ని ఎస్సీ 'ఏ'జాబితాలో చేర్చి 5 శాతం రిజర్వేషన్లు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో 18 నుండి 20 లక్షలకు పైబడి నేతకాని జనాభా ఉందన్నారు. రాజకీయ, ఆర్థిక సామాజిక అభివృద్ధి కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నాయకులు నరసయ్య, ఎస్.సోంబాయి, బొర్లకుంట దీపక్, బొల్ల రాజమల్లు, దుర్గం శేఖర్, ఎస్.రాజేష్, వి.యువరాజ్, ఆర్.చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.


మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న నేతకాని సంక్షేమ సంఘం నేతలు

అందరూ ఆధ్యాత్మిక భావనను కలిగి ఉండాలి


విష్ణు సహస్ర నామావళి నామార్థ సహితామృతం ఆధ్యాత్మిక పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

నల్లకుంట: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావన కలిగి ఉండాలని వక్తలు అన్నారు. శనివారం సాయంత్రం బాగ్ అంబర్‌పేటలోని శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో రచయిత మండా గంగా విజయ్ కుమార్ రూపొందించిన విష్ణుసహస్ర నామావళి నామార్థ సహితామృతం ఆధ్యాత్మిక పుస్తకావిష్కరణ సభ జరిగింది. దీనికి హాజరైన షిరిడీ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ ప్రతినిధులు పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సంస్థాన్ అధ్యక్షుడు పోకల కృష్ణ, ప్రధాన కార్యదర్శి పీవీ సాయి, ఎంఎస్ఎస్. శర్మ, పుస్తక రచయిత విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బడుగుల ఆశాజ్యోతి లక్ష్మణ్ బాపూజీ

తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ


లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బాలరాజుగౌడ్, అయిలి వెంకన్నగౌడ్ తదితరులు

సుందరయ్య విజ్ఞానకేంద్రం: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగొని బాలరాజుగౌడ్, కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్ అన్నారు. లక్ష్మణ్ బాపూజీ 12వ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో జలదృశ్యం వద్ద బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం చిక్కడపల్లిలోని తన కార్యాలయంలో వారు మాట్లాడుతూ స్వరాష్ట్రం కోసం పరితపించిన స్వచ్ఛమైన తెలంగాణ వాది అని, మంత్రి పదవిని సైతం తృణప్రాయంగా ఒదిలేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు.

మహ్మద్ ప్రవక్త బోధనలు అనుసరణీయం


అరవింద్‌కుమార్ యాదవ్‌ను సన్మానించిన అక్లక్ హుస్సేన్

ముషీరాబాద్: మహ్మద్ ప్రవక్త బోధనలు అనుసరణీయమని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అరవింద్ కుమార్ యాదవ్ అన్నారు. శుక్రవారం భోలక్‌పూర్‌లో మిలాద్ ఉన్ నబీ పండుగను పురస్కరించుకొని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అక్లక్ హుస్సేన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అరవింద్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకోవాలని, ఆపదలో ఉన్న వారికి తమవంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. కార్యక్రమంలో భోలక్‌పూర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు జఫీర్ ఉద్దీన్, నాయకులు కృష్ణాగౌడ్, మహ్మద్ జమీలుద్దీన్, ఉస్మాన్, అబ్దుల్ ఖరీం, ఖైరత్ ఆలీబాబా, మసూద్ తదితరులు పాల్గొన్నారు.

స్టడీ టూర్‌లో అస్సాంకు వెళ్లిన కార్పొరేటర్


స్టడీ టూర్‌కు వెళ్తున్న పావనీ దంపతులు

చిక్కడపల్లి: జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో చేపట్టిన మున్సిపల్ స్టడీ టూర్‌లో భాగంగా గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ దంపతులు శనివారం అస్సాం బయలుదేరి వెళ్లారు. ఆమె మాట్లాడుతూ ఇండోర్ నగరంలో చేపడుతున్న అభివృద్ధి , డ్రైనేజీ, తాగునీటి సరఫరాలను పరిశీలించనున్నట్లు చెప్పారు. లక్నో, గౌహతి, షిల్లాంగ్ నగరాల్లో నాలుగురోజులపాటు పర్యటించి స్వచ్ఛత, పచ్చదనం, ఐటీ, డ్రైనేజీ విభాగాల్లో అనుసరిస్తున్న విధానాలను అడిగి తెలుసుకుంటామన్నారు. మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్‌రెడ్డిలతో కలిసి మొత్తం 138 మంది రెండు టీమ్‌లుగా నాలుగు రోజులపాటు టూర్‌కు వెళ్లామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ సంయుక్త కన్వీనర్ వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శభాష్ నాగేష్

వరదలో కొట్టుకుపోతున్న వ్యక్తిని కాపాడిన జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్


నాగేష్‌ను సన్మానించిన జీహెచ్ఎంసీ ఈఈ శ్రీనివాస్‌చారి తదితరులు

ముషీరాబాద్: వరదలో కొట్టుకుపోతున్న ఓ వ్యక్తిని జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ నాగేష్ కాపాడి అందరితో శభాష్ అనిపించుకున్నారు. శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ముషీరాబాద్ డివిజన్‌లోని వైఎస్ఆర్ పార్కు మార్గంలో వరద రోడ్డుపై పెద్ద ఎత్తున ప్రవహిస్తోంది. అక్కడే విధులు నిర్వహిస్తున్న జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ నాగేష్, మరో ఇద్దరు కార్మికులు మహేష్, శ్రీను స్థానికులను అప్రమత్తం చేస్తున్నారు. అదే సమయంలో రామాలయం నుంచి వైఎస్ఆర్ పార్కు వైపు వెళ్లేందుకు ఓ ద్విచక్ర వాహనాదారుడు జీహెచ్ఎంసీ సిబ్బంది సూచనలు పట్టించుకోకుండా వెళ్లేందుకు ప్రయత్నించాడు. అయితే వరద ప్రవాహం తాకిడికి తట్టుకోలేక అదుపుతప్పి వాహనాదారుడు నీటిలో పడిపోయాడు. వరదలో కొట్టుకుపోతుండడంతో గమనించిన నాగేష్ ధైర్యంగా నీటిలోకి వెళ్లి ఆ యువకున్ని కాపాడారు. వాహనాన్ని సైతం బయటకు తీశారు. దీంతో నాగేశ్‌ను స్థానికులు, జీహెచ్ఎంసీ ఈఈ శ్రీనివాస్‌చారి, డీఈలు సన్నీ, గీతాకుమారి శనివారం జీహెచ్ఎంసీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు.

'బోనాల' అదనపు చెక్కుల పంపిణీ


అదనపు చెక్కును శ్రీహరికి అందజేస్తున్న అరవింద్ కుమార్

సుందరయ్య విజ్ఞానకేంద్రం: పండుగలు పర్వదినాలను కలిసిమెలసి జరుపుకోవాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అరవింద్ కుమార్ అన్నారు. బోనాల ఉత్సవాల అదనపు చెక్కును శనివారం బాగ్‌లింగంపల్లిలోని ఎల్ఐజీలోని రేణుక ఎల్లమ్మ దేవాలయం వద్ద ఆలయ అధ్యక్షుడు శ్రీహరికి అందజేశారు. ఈ సందర్భంగా అరవింద్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని అన్నారు.